క్లుప్తంగా

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

శాంతిపురం: కెనమాకులపల్లె శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం జరిగే ఈ ఉత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరుగుతుందన్నారు. 5న ధ్వజారోహణం, 6న హంసవాహనం, 7న హనుమంత వాహనం, 8న శేష వాహనం, 9న గరుడ వాహనం, కల్యాణోత్సవం, 10న గజ వాహనం, 11న రథోత్సవం, 12న డోపోత్సవం, 13న వసంతోత్సవం, 14న పుష్పయాగం ఉంటుందని వివరించారు. భక్తులు స్వామి వారి సేవలో పాల్గొనాలని కోరారు.

5న మంత్రి పెద్దిరెడ్డిచే ఆసరా చెక్కుల పంపిణీ

సోమల: మండల కేంద్రంలో బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ నాగరాజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి పర్యటనకు సంబంధించి కార్యక్రమ నిర్వహణపై చర్చించేందుకు సోమవారం ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన వెలుగు కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు వాహనాల వేలం

పుంగనూరు: ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణ కేసులో పట్టుబడిన వాహనాలను సోమవారం వేలం వేయనున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు వాహనాలను ఉదయం 10 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

6న రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

పలమనేరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 6న చిత్తూరు అగ్నిమాపక కేంద్ర సమీపంలోని రెవెన్యూ భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగనున్నట్లు పలమనేరు శాఖ కార్యదర్శి కాకర్ల పురుషోత్తం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీ జీవిత సభ్యులు, ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్ కలిగిన వ్యక్తులు గుర్తింపు కార్డుతో తప్పక హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9980193555 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భగవద్గీతపై ప్రచారం



తవణంపల్లె: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆదివారం మండలంలోని దిగువమత్యం దళితవాడలో భగవద్గీత గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, మన పండుగలు, సంప్రదాయాలు, గ్రంథాల గురించి వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షుడు ధనుంజయ, సభ్యులు మునిరత్నం, చంద్రబాబు, చటర్జీ, విమల, చిట్టెమ్మ, శాంతమ్మ, కిరణ్, ఈశ్వర్, చాముండి, సుష్మిత, నాగమ్మ, జ్యోతీశ్వరి, సరళాదేవి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: యాదమరి మండలం భూమిరెడ్డిపల్లె క్రాస్ వద్ద ఎస్ఈబీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 53 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. విక్రేత చంద్రమోహన్ (28)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

చిత్తూరు రూరల్: పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని ఈశ్వరగుడివీధిలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామికి రుద్రాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణతో కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. కల్యాణ ఘట్టాన్ని భక్తులకు వివరించారు. తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఓం నమఃశివయా.. హరహర శంకరా అంటూ భక్తి ప్రపత్తులతో తరించారు. ఉదయం భిక్షాండి ఉత్సవంలో స్వామివారు అభయమిచ్చారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం అశ్వవాహన సేవ నిర్వహించారు. భక్తులకు పసుపు, కుంకుమ, కల్యాణోత్సవ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివప్రసాద్, అర్చకులు శివకుమార్, ఈడ తిమ్మారెడ్డి, బలిజ సంఘం నాయకులు పూల సుబ్రమణ్యం, రామదాసు, రెడ్డప్ప, లోకనాథం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ





కరువుకు కేరాఫ్ చంద్రబాబు

- ఎమ్మెల్యే వెంకటేగౌడ
- మహిళాభివృద్ధే లక్ష్యంగా పథకాలు
- వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం, చిత్రంలో జెడ్పీ చైర్మన్ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె : గతంలో చంద్రబాబునాయుడు 14 సంవత్సరాల పాలనలో వర్షాలు లేక చెరువులు ఎండిపోయి .. గ్రామాల్లో తాగడానికి నీరులేక కరువుకు కేరాఫ్‌గా మారిన సంఘటనలు గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ అన్నారు. ఆదివారం బైరెడ్డిపల్లె ట్రాన్స్‌కో కార్యాలయ సమీపంలోని మైదానంలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని 1,053 గ్రూపులకు సంబంధించి 9,314 మంది లబ్ధిదారులకు రూ.9 కోట్ల 62 లక్షల మెగా చెక్కును అందజేశారు. మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టో హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పూర్తిగా నెరవేర్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబం లబ్ధి పొందిందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందని తెలిపారు. మండలంలోని కుప్పనపల్లె, టీఎస్‌కుప్పం, వెంగంవారిపల్లె, మిట్టకుద్రపల్లె, గుంతకుద్రపల్లె, పిచ్చిగుండ్లపల్లె, దేవదొడ్డి నుంచి దాసార్లపల్లె, బైరెడ్డిపల్లె నుంచి విరూపాక్షపురం వరకు రహదార్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. గతంలో గ్రామాలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, మహిళ ఆర్థిక సాధికారిత సాధిస్తే ఆ కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీని మరో సారి ఆదరిస్తే మరిన్ని పథకాలు అమలవుతాయని తెలిపారు. డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా మహిళలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో రైతుభరోసా కేంద్రాలు, ఆరోగ్యకేంద్రాలు, సచివాలయ భవనాలు, పాల కేంద్రాలు, గోడౌన్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అతిథులు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల వంటలను పరిశీలించారు. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించి చిరుధాన్యాలను అధికంగా సాగు చేయాలని సూచించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కార్తీక్, తహశీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఏరియా కోఆర్డినేటర్ హరినాథ్, ఏపీఎం లలిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులం సందర్శించిన ఎంపీ,ఎమ్మెల్సీ



స్పోర్ట్స్ కిట్‌కు నగదు అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆదివారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ సందర్శించారు. వసతుల గురించి విద్యార్థులను అడిగారు. పాఠశాలలో సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?లేదా అని విద్యార్థులను అడిగారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులు స్పోర్ట్స్ కిట్ లేదని సిబ్బంది ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ రూ.10 వేలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మన్సూర్ అలీ పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

రామకుప్పం: స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ తండ్రి విశ్వనాథ్ శెట్టి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోన్‌లో మురళీకృష్ణను పరామర్శించారు. రెస్కో చైర్మెన్ సెంథిల్, కుప్పం మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ సుధీర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అఖిలపక్ష నేతలు నివాళులర్పించారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



సోమల : పెద్ద ఉప్పరపల్లెలో ఏర్పాటు చేసిన డెస్కులు



పలమనేరు పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పలమనేరు: పలమనేరు మండలంలో పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఎంఈవో లీలారాణి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. మండలంలో ఆరు కేంద్రాల్లో 1,327మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల, హైస్కూల్, ఓఎల్ఎల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కొలమాసనపల్లె పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. విద్యార్థులకు సంబంధించి మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సోమలలో 341 మంది

సోమల: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ కేశవప్పిళ్లై ఆదివారం తెలిపారు. మండలంలోని సోమల, కందూరు,పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 341 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

సదుం మండలంలో 305 మంది

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సదుం, చెరుకువారిపల్లె, పాలమంద, బూరగమంద, ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలకు చెందిన 305 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

శాంతిపురం మండలంలో 740 మంది

శాంతిపురం: మండలంలో పదవ తరగతి పరీక్షలకు 740 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. శాంతిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 265 మంది, రాళ్లబూదుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 217 మంది, శాంతిపురం జూనియర్ కళాశాల సెంటర్‌లో 258 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మూడు కేంద్రాల్లో ఏర్పాట్లను ఆదివారం ఎంఈవో చంద్రశేఖర్ పరిశీలించారు. వసతులు కల్పించడంతో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పుంగనూరులో 1,558 మంది విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలో పదో తరగతి పరీక్షల కోసం 7 సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం 1,558 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పట్టణంలోని బసవరాజ హైస్కూల్, బాలికల జెడ్పీ హైస్కూల్, కొత్తయిండ్లు హైస్కూల్, విజ్ఞానజ్యోతి హైస్కూల్, భాష్యం హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మేలుపట్ల హైస్కూల్‌ను సెంటర్లుగా ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని పరీక్షల నిర్వాహణాధికారి రుద్రాణి తెలిపారు.

కనుల పండువగా సీతారామ కల్యాణం



సదుం: విశేషాలంకరణలో ఉత్సవమూర్తులు



రొంపిచెర్ల: బుసిరెడ్డిగారిపల్లెలో..

సదుం: మండలంలోని జాండ్రపేట శ్రీరామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకుడు రఘునాథరావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ కల్యాణాన్ని తిలకించేందుకు అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచారు.

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల శ్రీరాములగుడివీధి, బుసిరెడ్డిగారిపల్లె, గాజులపల్లెలో నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. సీతారాముల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి వేదకపై కొలువుదీర్చారు. అనంతరం భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. రొంపిచెర్లలో సీతారాముల ఊరేగింపు వేడుకగా జరిగింది. అన్నదానం చేశారు. రాజమోహన్, సుధాకర్, కోలా మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఇఫ్తియార్ విందు



ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

పలమనేరు: పట్టణంలోని గోల్డెన్ ఫంక్షన్ హాలులో ఆదివారం రంజాన్ ఇఫ్తియార్ విందు ఇచ్చారు. ఇంతిసాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇమామ్ జుబేర్ హజరత్, ఉర్దూ పండితులు మహబూబ్‌బాషా, ముర్తుజ, ముస్లింలుపాల్గొన్నారు. అంతకు ముందు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

చిత్తూరు రూరల్: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష రాసే విద్యార్థులు సోమవారం నుంచి ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని జిల్లా ప్రజారవాణశాఖ అధికారి జితేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఇంటి నుంచి పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఇందుకు విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించాలన్నారు. సోమవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పది పరీక్షలు జరగనున్నాయి. అప్పటి వరకు పబ్లిక్ సెలవులతో సంబంధం లేకుండా పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తున్నట్లు తెలిపారు. పల్లెవెలుగు, సిటీ బస్ సర్వీసుల్లో మాత్రమే అనుమతిస్తామన్నారు.

శేష వాహనంపై శ్రీరాముడు



చిత్తూరు రూరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారు శేష వాహనంపై విహరించారు. తొలుత శ్రీరామునికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తిని శేషవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. మేళతాళాల నడుమ ఊరేగింపు సాగింది.

యువతలో దేశభక్తిని పెంపొందించాలి



మాట్లాడుతున్న ప్రతాపరెడ్డి

చిత్తూరు రూరల్: యువతలో దేశభక్తి, దైవభక్తి పెంపొందించేందుకు సభ్యులు కృషి చేయాలని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని రామకృష్ణ ఆశ్రమంలో జిల్లా విశ్వ హిందూ పరిషత్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజ శ్రేయస్సుకు ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కమిటీలు వేయాలన్నారు. అనంతరం నగర కమిటీని జిల్లా కార్యదర్శి వేలు వెల్లడించారు. నగర అధ్యక్షుడిగా ధరణి, కార్యదర్శిగా బాలాజీ, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రామభద్ర, మణికంఠ, జయచంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చిచ్చర పిడుగులు

పుష్పు పుట్టగానే పరిమళిస్తుందంటారు. ఆకోవలోనే చిన్నతనం నుంచే చదువుతో పాటు సంప్రదాయ కళల్లో రాణిస్తున్నారు అక్కాతమ్ముడు. ఎంచుకున్న రంగాల్లో ప్రతిభ చాటుతూ అవార్డుల పంట పండిస్తున్నారు. ఏస్థాయి వేదికైనా ఎలాంటి బెదురు..బెరుకు లేకుండా దూసుకుపోతున్నారు. బుడతలు కాదు.. చిచ్చర పిడుగులుగా చెలరేగుతున్నారు. జాతీయస్థాయి పోటీలకు సైతం ఎంపికై సత్తా చాటుతున్నారు. కుప్పం మండలం గోనుగూరుకు చెందిన అక్కాతమ్ముడు చైత్ర, లక్ష్మీచైతన్య విజయవాణిని తెలుసుకుందాం..



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో చైత్ర,లక్ష్మీ చైతన్య

- చదువు..కళల్లో రాణిస్తున్న అక్కాతమ్ముడు
- కౌషల్ జాతీయ పోటీలకు ఎంపికైన లక్ష్మీచైతన్య
- హరికథ, భరతనాట్యంలో 50కి పైగా ప్రదర్శనలు
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 8వ ఏటనే హరికథ ప్రదర్శన
- వందకు పైగా వరించిన బహుమతులు, పురస్కారాలు



హరికథ ఆలపిస్తున్న లక్ష్మీచైతన్య



చైత్ర, లక్ష్మీ చైతన్య సాధించిన బహుమతులు,



చైత్ర భారతనాట్య ప్రదర్శన

కుప్పంరూరల్ : చదువుతోపాటు సంప్రదాయ కళల్లో రాణిస్తూ తల్లిదండ్రులు, గురువులు..గ్రామానికి పేరు తీసుకు వస్తున్నారు కుప్పం మండలం గోనుగూరు పాఠశాల ఉపాధ్యాయుడు డి.మధుకుమార్‌కు కుమార్తె చైత్ర, కుమారుడు లక్ష్మీ చైతన్య. చైత్ర తిరుపతి ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం, లక్ష్మీ చైతన్య గోనుగూరు ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరు చిన్నతనం నుంచే హార్మోణియం, వయోలిన్, హరికథ, భరతనాట్యం, చెకుముకి, పద్యాలు వల్లెవేయడం వంటి కళల్లో ప్రావీణ్యం పొంది 50కి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. వివిధ మ్యాథ్స్, సైన్స్ పోటీ పరీక్షల్లోను సత్తాచాటుతున్నారు. కౌషల్ మ్యాథ్స్ అండ్ సైన్స్ పోటీల్లో అక్కాతమ్ముడు స్టేట్ ఫస్ట్ బహుమతులు సాధించి అప్పటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నుంచి ప్రశంసలు కూడా పొందారు. చైత్ర 9వ ఏట నుంచి, లక్ష్మీచైతన్య 8వ ఏట నుంచి వయోలిన్, హరికథలు గుండ్లపల్లెకు చెందిన రత్నం భాగవతార్ వద్ద సాధన చేశారు. పద్యాలాపన తల్లిదండ్రుల వద్దనే శిక్షణ పొందారు. చైత్ర భరతనాట్యం రూపా మాస్టర్ వద్ద తర్ఫీదు పొందింది. వీరిద్దరు కలిసి హరికథ, భరతనాట్యంలో 50 పైగా ప్రదర్శనలు ఇచ్చారు. చిత్తూరు, గుంటూరు, విజయవాడ, శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

చదువులోనూ టాపర్‌లే

చైత్ర 10వ తరగతిలో గోనుగూరు పాఠశాలలో టాపర్‌గా నిలవగా, లక్ష్మీచైతన్య సైనిక్‌స్కూల్, నవోదయ పరీక్షల్లో జిల్లా ఫస్ట్‌గా నిలిచాడు. నార్త్ అమెరికా తెలుగు సొసైటీ నిర్వహించిన తెలుగు పద్యాల వల్లికలో అక్కా, తమ్ముడు స్టేట్ ఫస్ట్ ప్రైజ్ సొంతం చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం, ఇస్రో సంయుక్తంగా నిర్వహిస్తున్న కౌషల్ మ్యాథ్స్ అండ్ సైన్స్ పోటీల్లోను అక్కా తమ్ముడు స్టేట్ ఫస్ట్ బహుమతులు పొందారు. అప్పటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నుంచి అక్కా, తమ్ముడు ప్రత్యేక ప్రశంసలు పొందారు.

జాతీయ స్థాయి పోటీలకు లక్ష్మీ చైతన్య

లక్ష్మీ చైతన్య 8వ ఏటనే హరికథ ప్రదర్శన ఇచ్చి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. పోటీ పరీక్షల్లోనూ ప్రత్యేకత చాటుకుంటున్నాడు. కౌషల్ పోటీ పరీక్షల్లో వ్యక్తిగత విభాగంలో 2021 స్టేట్ ఫస్ట్, 2022లో రెండవ బహుమతి పొందాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే మరో పోటీ పరీక్ష విద్యార్థి వైజ్ఞానిక్ మందన్ (మ్యాథ్స్ అండ్ సైన్స్ పోటీల్లో) 2020, 21, 22లో స్టేట్ మొదటి బహుమతి సాధించాడు. మే జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక విద్యార్థి లక్ష్మీ చైతన్య కావడం గమనార్హం.

ప్రాచీన కళలను కాపాడడమే లక్ష్యం

> 5జీ వంటి అత్యాధునిక యుగంలో ప్రాచీన కళలైన హరికథ, హార్మోణియం, భరతనాట్యం, వయోలిన్ వంటి కళలు అంతరించిపోతున్నాయి. వీటిని కాపాడుకునేందుకే చిన్నతనం నుంచి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాధన చేస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువులు, పాఠశాల తరువాత సాయంత్రం కళలను సాధన చేస్తున్నాం. మా గురువులు రత్నం భాగవతార్, రూపా మాస్టర్, మా తల్లిదండ్రులు మమ్మల్ని ప్రోత్సహించడంతోనే విజయాలు సాధ్యమవుతున్నాయి. కౌషల్ స్టేట్ మొదటి బహుమతి పొందినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది.
>
> – చైత్ర, లక్ష్మీ చైతన్య

ఘనంగా మట్టల పండుగ



చిత్తూరు: మట్టలతో ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవులు

చిత్తూరు రూరల్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని నగరంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. టౌన్ చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ రెవరెండ్ డార్విన్ క్రిష్టియన్ దాస్, చర్చి సభ్యులు ఈత మట్టలతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. భజనలు, గీతాలాపనలు చేస్తూ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే సెయింట్ లూక్ చర్చి సభలో మట్టలతో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ శ్యామ్యూల్ బాబు పండుగ విశిష్టతను వివరించారు. అలాగే అంబేడ్కర్ నగర్‌లో చిన్నారులు, మత పెద్దలు కలిసి స్థానిక వీధుల్లో మట్టలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ దివ్య ప్రియ, సభ్యులు జోసెఫ్, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బిషప్‌లు, పాస్టర్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్‌లు గుడ్‌ఫ్రైడే పవిత్రతను వివరించారు. ప్రార్థనల అనంతరం మట్టలతో ఊరేగింపుగా వెళ్లారు.



గుడిపాలలో..